# కలం
ప్రజల గళం...

kalamdaily.com

Follow on: Kalamtelugu

శనివారం • 25-04-2026

పేజీలు: 3


360° SINGLE TOPIC

## సోషల్ మీడియా

# కిల్లర్ రీల్స్!

## వ్యూస్, లైక్స్ కోసం ప్రమాదకర స్టంట్లు

### ప్రాణాలు కోల్పోతూ.. ఇతరుల ప్రాణాలూ తీస్తున్న యూత్

### సోషల్ మీడియాలో నో కంటెంట్ ఫిల్టర్

### ప్రమాదాల నివారణకు ప్రభుత్వాల చర్యలు శూన్యం

### పిల్లలపై నిఘా పెట్టని తల్లిదండ్రులు

2026 ఏప్రిల్.. హైదరాబాద్‌లోని మల్లాపూర్ బస్తీలో బిహార్‌కు చెందిన బాలుడు మిథున్ (14) బాల్కనీ గోడపై రీల్స్ చేస్తూ పట్టుతప్పి కిందపడిపోయాడు. తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చేరి, 15 రోజుల పాటు మృత్యువుతో పోరాడి చనిపోయాడు.

2024 జులై.. హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు ఫ్రెండ్స్ బైక్‌పై స్టంట్స్ చేస్తూ అదుపుతప్పి కిందపడిపోయారు. వీరిలో ఒకరు చనిపోగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి.

2024 జనవరి.. హైదరాబాద్‌కు చెందిన ఏడుగురు స్నేహితులు కొండపోచమ్మ సాగర్‌కు వెళ్లారు. రిజర్వాయర్ లోపల సెల్ఫీలు దిగుతున్న క్రమంలో ఒకతను జారిపడి నీళ్లలో మునిగిపోయాడు. అతణ్ని కాపాడేందుకని ఒకరి తర్వాత ఒకరు వెళ్లి.. మొత్తం ఐదుగురు చనిపోయారు.

2023 మే.. హైదరాబాద్‌కు చెందిన మైనర్ మహమ్మద్ సర్ఫరాజ్ (16) ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ కోసం ఫ్రెండ్స్‌తో కలిసి సనత్‌నగర్‌లోని రైల్వే ట్రాక్ మీదికి వెళ్లాడు. రీల్స్ చేస్తున్న క్రమంలో ఎంఎంటీఎస్ ట్రైన్ ఢీకొని చనిపోయాడు.


...ఇలా ఒక్క తెలంగాణలోనే కాదు.. దేశవ్యాప్తంగా ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. వ్యూస్, లైక్‌లు, కామెంట్ల వెర్రితో ప్రాణాలు కోల్పోతూ.. ఇతరుల ప్రాణాలూ తీస్తున్నారు.

సోషల్ మీడియాలో ఫేమస్ కావాలనే పిచ్చితో యువత ప్రమాదకరమైన ప్రయోగాలు చేస్తున్నారు. రైళ్లకు అడ్డంగా వెళ్లడం, కొండలు, గుట్టలు ఎక్కి లోయల పక్కన ఫొటోలు దిగడం, జలపాతాల దగ్గర ఆటలాడడం, బిల్డింగ్‌లు ఎక్కి దూకడం, బైక్‌లపై రోడ్ల మీద స్టంట్లు చేయడం, కార్లు, బైక్‌లను వంద కి.మీల స్పీడ్‌తో నడపడం.. లాంటివి చేస్తూ ప్రాణాలు కోల్పోతున్నారు. కొన్నిసార్లు ఇతరుల ప్రాణాలు పోవడానికీ కారణమవుతున్నారు.

సోషల్ మీడియా ప్రమాదాలు ఇటీవల పెరిగిపోయాయి. అసలు పిల్లలు, యువత సోషల్ మీడియాకు అడిక్ట్ కావడానికి కారణాలేంటి? ఈ 'డెత్ రీల్స్'ను అడ్డుకునేదెలా? తల్లిదండ్రులు, సోషల్ మీడియా సంస్థలు, ప్రభుత్వాలు ఏం చేయాలి? కలం 360 డిగ్రీస్ స్పెషల్ ..

- సెంట్రల్ డెస్క్, కలం





## సోషల్ మీడియా జాడ్యానికి అదే పునాది..

యువత సోషల్ మీడియాకు అడిక్ట్ కావడానికి తల్లిదండ్రులే మొదటి కారణం. చిన్నప్పటి నుంచే ఫోన్లు చేతికి ఇచ్చేస్తున్నారు. యూట్యూబ్‌లో రీల్స్ చూపిస్తున్నారు. అవి చూస్తూ పెరిగిన పిల్లలు.. పది, పదిహేనేండ్ల వయసు వచ్చాక రీల్స్ చేయడం మొదలుపెడుతున్నారు. ఇతరుల లాగా సోషల్ మీడియాలో ఫేమస్ అయిపోవాలనే ఆతృతతో ఏదో ఒకటి వినూత్నంగా చేయాలని ఆలోచిస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదకరమైన స్టంట్లు చేస్తూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు.

- చిన్నతనంలో యూట్యూబ్‌లో రీల్స్ చూస్తూ పెరిగిన పిల్లలు.. ఐదారేండ్ల వయసు వచ్చాక వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వాడడం మొదలుపెడుతున్నారు.
- ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లో రీల్స్ చూసి.. అలాగే తాము చేయాలని భావిస్తున్నారు.
- అసలు పిల్లలు ఏం చూస్తున్నారు? ఏం చేస్తున్నారు? అనేది తల్లిదండ్రులు పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలోనే వాళ్లు సోషల్ మీడియాకు బానిసలవుతున్నారు. లైక్‌లు, కామెంట్ల కోసం ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు.

## ప్రమాదాలకు కారణాలివీ..

**డిజిటల్ డాపమైన్:**

వీడియోలకు వచ్చే ప్రతి లైక్, కామెంట్ రీల్స్ చేసేవాళ్లకు ఉత్సాహాన్నిస్తుంది. దీని ద్వారా మెదడులో 'డాపమైన్' అనే హార్మోన్ విడుదలవుతుంది. ఇది ఒక రకమైన వ్యసనంలా మారి, అంతకంటే ఎక్కువ గుర్తింపు కోసం మరిన్ని ప్రమాదకరమైన పనులు చేసేలా ప్రేరేపిస్తుంది.

**పక్కవాళ్లతో పోలిక:**

పక్కవాళ్లు ఏదో కొత్తగా చేసి వైరల్ అవుతుంటే, మనం కూడా ఏదో ఒకటి విభిన్నంగా చేయాలనే ఒత్తిడి యువతలో పెరుగుతున్నది.

**అవగాహనలేమి:**

చాలామంది యువతీ యువకులు 'నాకేం కాదులే' అనే అతి విశ్వాసంతో ఉంటున్నారు. ఒక్క చిన్న పొరపాటు ప్రాణం తీస్తుందని వారు గ్రహించలేకపోతున్నారు. రీల్స్ మోజులో ఏం చేస్తున్నామో అనే అవగాహన కూడా లేకుండా ప్రమాదకరమైన పనులు చేస్తున్నారు.

**నిఘా లేకపోవడం:**

ప్రమాదకరమైన ప్రదేశాల్లో (రైల్వే ట్రాక్‌లు, చెరువులు, కొండలు) హెచ్చరికలు ఉన్నప్పటికీ.. అక్కడ సరైన భద్రత, నిఘా లేకపోవడం కూడా ప్రమాదాలకు కారణమవుతున్నది.

## నివారణ చర్యలివీ..

**సోషల్ మీడియా ప్రమాదాలను అరికట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. సోషల్ మీడియా సంస్థలు కంటెంట్‌ను ఫిల్టరింగ్ చేయాలి. ప్రమాదకరమైన వీడియోలను ప్రోత్సహించవద్దు. తల్లిదండ్రులు పిల్లలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలి. యువత కూడా తాము చేస్తున్నది తప్పో? రైటో? అనేది గ్రహించాలి.**

### సోషల్ మీడియా సంస్థల బాధ్యత

- ప్రమాదకరమైన పనులు చేస్తున్న వీడియోలను గుర్తించి, వాటిని వెంటనే తొలగించాలి.
- ప్రమాదకరంగా అనిపించే వీడియోలపై 'Don't try this' వంటి హెచ్చరికలను స్పష్టంగా ఉంచాలి.




### ప్రభుత్వ చర్యలు

- రైల్వే ట్రాక్‌లు, రోడ్లపై రీల్స్ చేసే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో పోలీసులు ఇలాంటి వారి ఫోన్లను జప్తు చేస్తున్నారు.
- టూరిస్ట్ స్పాట్ల వద్ద భద్రతను కట్టుదిట్టం చేయాలి. కొండలు, గుట్టలు, జలపాతాల వద్ద ఫొటోలు, వీడియోలను బంద్ చేయాలి.
- పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు సోషల్ మీడియాను సురక్షితంగా ఎలా వాడాలనే అంశంపై అవగాహన కల్పించాలి.



### వ్యక్తిగత బాధ్యత

- సోషల్ మీడియా కన్నా ప్రాణం విలువైనదని యువత గుర్తించాలి.
- కేవలం ప్రాణాల మీదకు తెచ్చుకునే స్టంట్లు మాత్రమే కాదు.. ప్రతిభ, హాస్యం, సమాచారం వంటి వాటితో కూడా గుర్తింపు పొందవచ్చని గ్రహించాలి.



### తల్లిదండ్రుల పాత్ర

- పిల్లలు సోషల్ మీడియాలో ఎలాంటి వీడియోలు చూస్తున్నారు? ఏం చేస్తున్నారు? అనేది గమనిస్తుండాలి.
- ఇలాంటి ప్రమాద వార్తలను చూపిస్తూ, వాటి పర్యవసానాలను పిల్లలకు వివరించాలి. వారిలో చిన్నప్పటి నుంచే 'డిజిటల్ బాధ్యత'ను పెంచాలి.

### హుక్

ఒక వ్యక్తి ఒక వీడియోను చూసి అది నచ్చిందో లేదో నిర్ణయించుకోవడానికి సగటున 7 సెకన్లు మాత్రమే పడుతుంది. అందుకే రీల్స్ చేసేవారు మొదటి 3 నుంచి 5 సెకన్లలోనే ఏదో ఒక షాకింగ్ లేదా ఆకర్షణీయమైన విషయాన్ని చూపించడానికి ప్రయత్నిస్తారు. దీన్నే 'హుక్' అంటారు.

### టిక్‌టాక్ బ్రెయిన్

నిరంతరం రీల్స్ చూడటం వల్ల మనుషుల్లో అటెన్షన్ స్పాన్ (ఏకాగ్రత సమయం) తగ్గిపోతోంది. దీనివల్ల పుస్తకాలు చదవడం లేదా సుదీర్ఘమైన సంభాషణలు వినడం యువతకు కష్టంగా మారుతోంది. దీన్ని 'టిక్‌టాక్ బ్రెయిన్' అని పిలుస్తున్నారు.

### భార్య రీల్స్ చేస్తోందని విడాకులు కోరిన భర్త

ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ మహిళ రోజూ రీల్స్ చేస్తోందని, ఆమె భర్త ఏకంగా విడాకులు కావాలంటూ కోర్టుకు వెళ్లాడు. 'నా భార్య రోజూ 15 నుంచి 20 రీల్స్ చేస్తోంది. నన్ను, పిల్లలను, అత్తామామలను పట్టించుకోవడం లేదు. ఇంట్లో వంట చేయడం లేదు. పైగా నన్ను చులకనగా చూపిస్తూ వీడియోలు తీస్తోంది. నాకు విడాకులు ఇప్పించండి" అంటూ బాధిత భర్త కోర్టుకు విజ్ఞప్తి చేశాడు.



# దేశవ్యాప్తంగా ఎన్నో ఘటనలు..

- 2024 జులై: ముంబైకి చెందిన సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ ఆన్వీ కాందార్ (26) 2024 జులై 16న మహారాష్ట్రలోని కుంభే వాటర్ ఫాల్ దగ్గర రీల్స్ తీసుకుంటూ.. 300 అడుగుల లోయలో పడిపోయి చనిపోయింది.

- 2026 ఏప్రిల్: మధ్యప్రదేశ్‌లోని మౌగంజ్ జిల్లాకు చెందిన ముగ్గురు అన్నదమ్ములు ఈ నెల 19న బైక్‌పై విన్యాసాలు చేస్తూ రీల్స్ తీశారు. ఈ క్రమంలో వేగంగా వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ముగ్గురూ అక్కడికక్కడే మరణించారు.



- 2026 మార్చి: గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు చెందిన అవధ్ తివారీ (20).. మార్చి 15న ఇద్దరు ఫ్రెండ్స్‌తో కలిసి కారులో రైడ్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చేస్తూ కారును 150 స్పీడ్‌లో నడిపాడు. ఆ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఆ తర్వాత కొద్దిసేపటికే కారు అదుపుతప్పి గోడను ఢీకొట్టింది. ఈ ఘటనలో అవధ్ తివారీ, అతని మిత్రుడు అక్షయ్ వాఘేలా చనిపోయారు. మరో మిత్రుడు దేవ్‌రాజ్ తీవ్రంగా గాయపడ్డాడు.





## ఆ తల్లి ఆవేదన తీరేదెలా?

గుజరాత్‌లోని ద్వారకాలో 2026 ఫిబ్రవరి 3న సిస్టర్‌తో కలిసి ఓ మైనర్ బాలుడు కారులో రైడ్‌కు వెళ్లాడు. రీల్స్ చేస్తూ కారును స్పీడ్‌గా నడిపాడు. ఈ క్రమంలో బైక్‌పై వెళ్తున్న యువకుడిని ఢీకొట్టగా, స్పాట్‌లోనే చనిపోయాడు. ఈ ఘటనపై చనిపోయిన యువకుడి తల్లి సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు వైరల్ అయింది. ‘‘నా కొడుకు సాహిల్ ధనేశ్రా (23)ను ఓ మైనర్ బాలుడు కారుతో ఢీకొట్టి చంపేశాడు. నేనో సింగిల్ మదర్.. 23 ఏండ్లు కష్టపడి నా కొడుకును పెంచాను. కానీ ఒక ఫన్నీ రీల్ నా కొడుకు ప్రాణాన్ని బలితీసుకుంది.. నన్ను ఒంటరి చేసింది.. నాకు న్యాయం చేయండి. మైనర్ పిల్లలకు కార్లు, బైక్‌లు ఇచ్చేటప్పుడు తల్లిదండ్రులు ఒక్కసారి ఆలోచించండి’’ అని ఆమె విజ్ఞప్తి చేశారు.





## రీల్ మేకర్స్‌తో అమాయకులూ బలి..

రోడ్లపై విన్యాసాలు చేస్తూ రీల్స్ చేసేవాళ్లు.. వాళ్ల ప్రాణాలు పోగొట్టుకోవడమే కాకుండా అమాయకుల ప్రాణాలనూ బలి తీసుకుంటున్నారు. ఇలాంటి వాళ్లపై అన్ని రాష్ట్రాల పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి.

**- నితిన్ గడ్కరీ, కేంద్ర మంత్రి**



## చంపే స్థాయికి రీల్స్ వెర్రి..

రీల్ మేకర్స్ అంటే భయపడాల్సిన పరిస్థితి వచ్చింది. వ్యూస్ కోసం ఎదుటివారిని చంపే స్థాయికి ఈ వెర్రి వెళ్తోంది. సోషల్ మీడియా సంస్థలు ఇలాంటి వీడియోలను ఎందుకు అనుమతిస్తున్నాయి?

**- ఆర్నాబ్ గోస్వామి, ప్రముఖ జర్నలిస్టు**

## మంటగలుస్తున్న మానవత్వం

సోషల్ మీడియా పిచ్చితో సమాజంలో మానవత్వం మంటగలుస్తున్నది. ఎవరైనా ప్రమాదంలో ఉంటే ఫోన్‌లో వీడియోలు తీస్తున్నారు తప్పితే.. వాళ్లను కాపాడాలనే స్పృహ ఉండడం లేదు. దేశవ్యాప్తంగా ఇలాంటి ఘటనలు చాలా జరిగాయి. ఈ ధోరణిపై సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ కూడా ఆవేదన వ్యక్తం చేశారు. ‘‘రోడ్డు ప్రమాదం జరిగితే బాధితులను కాపాడే వారికంటే.. మొబైల్‌లో వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టేవారే ఎక్కువయ్యారు. ఇది సమాజానికి చాలా ప్రమాదకరం” అని ఆయన అన్నారు.

- గతేడాది హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో నాలుగేండ్ల చిన్నారిని ఆయా తీవ్రంగా కొట్టింది. బాత్‌రూమ్‌కు తీసుకెళ్లిన సమయంలో చిన్నారిని నేలకేసి కొట్టడం, కాళ్లతో తన్నడం లాంటివి చేసింది. ఈ దారుణాన్ని ఓ వ్యక్తి తన మొబైల్‌లో వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టాడు. ఆ చిన్నారిని రక్షించడానికి బదులు, ఆ వ్యక్తి వీడియో తీస్తూ ఉండిపోవడంపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.
- గతేడాది ఓ అమ్మాయి తన తండ్రి శవం పక్కన కూర్చొని రీల్స్ చేసింది. ఇది సోషల్ మీడియాలో వైరల్ అయింది. తండ్రి చనిపోయినా బాధ లేకుండా, ఆ శవం దగ్గర రీల్స్ చేయడంపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి.


ఏఐ ఫొటో